ప్రయాణికులకు ఇండిగో షాక్

ముందు వరుస సీట్ల కోసం రూ.2 వేల వరకు అదనపు చార్జీలు

న్యూఢిల్లీ, జనవరి 9: ఇండిగో విమానాల్లో ముందు వరుస సీట్లు కావాలంటే ప్రయాణికులు రూ.2,000 వరకు అదనంగా చెల్లించుకోవాల్సిందే. ఈ మేరకు సంస్థకు చెందిన వెబ్‌సైట్‌లో ఆయా సేవలకుగాను పేర్కొన్న ఫీజులు, చార్జీలనుబట్టి తెలుస్తున్నది. 232, 222 సీట్లుండే ఏ321 విమానాల్లోనైనా.. 186, 180 సీట్లుండే ఏ320 విమానాల్లోనైనా మొదటి వరుసలో విండో లేదా ఆస్లే సీటు కావాలంటే రూ.2,000 చెల్లించాలి. ఇప్పటిదాకా ఇది రూ.1,500 వరకు ఉన్నట్టు విమానయాన రంగ విశ్లేషకుడు అమేయ జోషి చెప్తున్నారు. ఇదిలావుంటే మధ్య సీటు కోసం రూ.1,500 ఇవ్వాల్సి ఉంటుందని సంస్థ పేర్కొంటున్నది. కాగా, ఏటీఆర్ విమానాల్లో ఈ చార్జీలు రూ.500 వరకు ఉన్నాయి. అయితే దీనిపై ప్రయాణికుల నుంచి, నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నా.. సంస్థ నుంచి మాత్రం ఎటువంటి స్పందనా లేదు. విమాన ఇంధన ధరలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గత వారం దూరాన్నిబట్టి ఆయా రూట్ల టిక్కెట్లపై రూ.1,000 వరకు సంస్థ తగ్గించిన విషయం తెలిసిందే.

హైబిజ్ టీవీ రియాల్టీ అవార్డులు

హైదరాబాద్, జనవరి 9: రియాల్టీ అవార్డులను సైతం అందించడానికి సిద్ధమైంది హైబిజ్ టీవీ. ఇప్పటి వరకు మీడియా, సామాజిక వర్గాల్లో విశేష కృషి చేసిన వారికి అవార్డులు అందించిన హైబిజ్ టీవీ..తాజాగా రియల్ ఎస్టేట్ రంగంలో విశేషంగా కృషి చేసిన వారికి తొలిసారిగా అవార్డులను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 18లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచింది. ఇలా ఎంపికైనవారికి నెల 25న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా అవార్డులను అందించనున్నది.

టీ హబ్‌లో ఈవీ బూట్ క్యాంప్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): టీ హబ్ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉజ్వల భవిష్యత్ ఉన్న ఎలక్ట్రిక్ వాహన తయారీ రంగంలో వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన టెక్నాలజీ, తయారీ రంగానికి అవసరమైన ఉత్పత్తుల గురించి ఔత్సాహికులకు తెలియచేసేందుకుగాను టీ హబ్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నది. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఐదు రోజులపాటు ఈవీ బూట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నది. ఐఐఎం రాంచీతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు (https:// bit.ly/ 3NWsM3n)లో సంప్రదించాలన్నారు.

ఈ ఏడాది రూ.4 లక్షల కోట్ల ఐపీవో డీల్స్

ముంబై, జనవరి 9: ఈ సంవత్సరం ఐపీవోలు, సంబంధిత డీల్ మేకింగ్ కార్యకలాపాలు జోరుగా సాగుతాయని కొటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అంచనా వేస్తున్నది. 2021లో ఐపీవో డీల్స్ ద్వారా రికార్డుస్థాయిలో 50 బిలియన్ డాలర్ల (రూ.4.15 లక్షల కోట్లు) నిధుల సమీకరణ జరిగిందని, 2024లో ఈ స్థాయిని మించి లావాదేవీలు జరుగుతాయని అంచనా వేస్తున్నట్టు కొటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సీఈవో రమేష్ తెలిపారు. నవతరం టెక్ కంపెనీల నేతృత్వంలో ప్రైమరీ మార్కెట్ జోరు చూపిస్తుందన్నారు. ఈ సంవత్సరం మరిన్ని పెద్ద ఐపీవోలు మార్కెట్లోకి రావచ్చన్నారు.

ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్ ఇండియా లిమిటెడ్ సీఎండీ జాయ్ అలూక్కాస్‌ను 'హాల్ ఆఫ్ ఫేమ్-జెమ్స్ ఆఫ్ ప్రెస్టీజ్ అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో జీజేఈపీసీ చైర్మన్ విపుల్ షా, వైస్ చైర్మన్ కిరిట్ భన్సాలీ తదితరులున్నారు.

మూడేండ్లలో ఐదు కార్లు

మార్కెట్లోకి విడుదల చేయనున్న రెనో

న్యూఢిల్లీ, జనవరి 9: ఫ్రెంచ్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ రెనో..దేశీయ మార్కెట్లో మరింత పట్టు సాధించడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది. వచ్చే మూడేండ్లకాలంలో దేశీయ మార్కెట్లోకి ఐదు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గతేడాది సంస్థ విక్రయాలు స్థబ్దుగా నమోదయ్యాయని, ఈసారి పుంజుకునే అవకాశం ఉన్నదని రెనో ఇండియా సీఈవో, ఎండీ వెంకట్రామ్ మామిల్లపల్లి తెలిపారు. 2023లో దేశీయంగా 49 వేల యూనిట్ల విక్రయాలు జరిపిన సంస్థ..28 వేల యూనిట్లను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న మాడళ్లను ఆధునీకరించి విడుదల చేయనుండటంతో ఈ ఏడాది రెండంకెల వృద్ధి నమోదుకావచ్చునని చెప్పారు.

చౌకైన ఆటోమేటిక్ కారు

దేశంలో అత్యంత చౌకైన ఆటోమేటిక్ కారు అందుబాటులోకి తీసుకొచ్చింది రెనో. తాజాగా క్విడ్ ఆటోమేటిక్‌ను పరిచయం చేసింది. రూ.4.69 లక్షల నుంచి రూ.5.95 లక్షల మధ్యలో లభించనున్నది. దేశీయంగా లభిస్తున్న ఆటోమేటిక్ వెర్షన్లలో ఇదే తక్కువ ధర కలిగిన మాడల్ కావడం విశేషం. 14 అదనపు ఫీచర్స్‌తో రూపొందించిన ఈ మాడల్‌లో సీట్ బెల్ట్ రీమైండర్, ఎలక్ట్రానిక్ స్టేబులిటీ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్ వంటివి ఉన్నాయి.

నిఫ్టీ @ 23,500

ఈ ఏడాది చివరికల్లా.. టార్గెట్‌ను పెంచిన గోల్డ్‌మాన్ శాక్స్

న్యూఢిల్లీ, జనవరి 9: జీడీపీ వృద్ధి అంచనాలు మెరుగుపడటంతోపాటు వడ్డీ రేట్ల బాట పట్ల స్పష్టత రావడంతో అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మాన్ శాక్స్ నిఫ్టీ-50 లక్ష్యాన్ని పెంచింది. ఈ ఏడాది చివరికల్లా 23,500 పాయింట్లకు చేరుతుందని తాజా అంచనాల్లో వెల్లడించింది. నవంబర్ నెలలో విడుదల చేసిన 21,800 పాయింట్ల లక్ష్యాన్ని కేవలం రెండు నెలల్లోనే పెంచింది. మంగళవారం నిఫ్టీ ముగింపు విలువ 21,545 పాయింట్లతో పోలిస్తే 2024 చివరినాటికి మరో 8.5 శాతం ర్యాలీని గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా వేస్తున్నది. గత రెండు నెలలుగా అంతర్జాతీయ స్థూల ఆర్థిక వాతావరణం సానుకూలంగా మారిందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ పేర్కొంటూ యూఎస్ వృద్ధి పటిష్ఠంగా ఉంటుందని, యూఎస్, ఇతర ఆసియా దేశాల్లో వడ్డీ రేట్ల కోతలు త్వరితంగా జరుగుతాయని, డాలరు విలువ మరింత తగ్గుతుందన్న అంచనాలు నెలకొన్నాయని వివరించింది. అక్టోబర్ కనిష్ఠస్థాయి నుంచి 15 శాతం ర్యాలీ జరపడం ద్వారా పలు సానుకూల అంశాల్ని మార్కెట్ పాక్షికంగా డిస్కౌంట్ చేసుకున్నప్పటికీ, మెరుగైన వృద్ధి, రేట్ల కోతల అంచనాలతో నిఫ్టీ ఇండెక్స్ టార్గెట్‌ను పెంచుతున్నట్టు గోల్డ్‌మాన్ తెలిపింది.

కార్పొరేట్ లాభాల్లో 20 శాతం వృద్ధి

భారత్‌లో కార్పొరేట్ లాభాలు ఈ ఏడాది కూడా రెండంకెల్లో వృద్ధిచెందుతాయని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అంచనా వేసింది. 2023లో ఎంఎస్‌సీఐ ఇండియా ఇండెక్స్‌లో ఉన్న కంపెనీల లాభాల వృద్ధి అంచనా 20 శాతంకాగా, 2024లో 15 శాతం, 2025లో 14 శాతం చొప్పున పెరుగుతాయని భావిస్తున్నట్టు తెలిపింది. వృద్ధి అన్ని రంగాల్లోనూ ఉంటుందని, కార్పొరేట్ల ఆదాయ, లాభాల వృద్ధితో రానున్న సంవత్సరాల్లో ఇండెక్స్ రాబడులు పెరుగుతాయని పేర్కొంది.

అమ్మకాల ఒత్తిడిలో మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలు చివరి గంటలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. ఇంట్రాడేలో 680 పాయింట్లు పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 30.90 పాయింట్లు అందుకొని 71,386.21 వద్దకు చేరుకోగా, నిఫ్టీ కూడా 31.95 పాయింట్లు ఎగబాకి 21,544.85 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సూచీ 211.45 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. మార్కెట్లో లార్సెన్ అండ్ టుబ్రో షేరు 1.55 శాతం బలపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టాటా మోటర్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, నెస్లె, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 2.52 శాతం, పవర్ 1.10 శాతం, ఆటో 1.02 శాతం, హెల్త్‌కేర్, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు మదుపరుల మద్దతు లభించింది. కానీ, ఎఫ్ఎంసీజీ, టెలికం, బ్యాంకింగ్, కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లు నష్టపోయాయి.

రెడ్‌మీ నోట్ 13 విడుదల

ప్రారంభ ధర రూ.29,999

హైదరాబాద్, జనవరి 9: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీ.. రాష్ట్ర మార్కెట్లోకి రెడ్‌మీ నోట్ 13 సిరీస్ ఫోన్‌ను పరిచయం చేసింది. 6.67 అంగుళాల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్లో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, మీడియాటెక్ హెలియో 9200+ ప్రాసెసర్, 108 మెగాపిక్సెల్+8 మెగాపిక్సెల్+2 మెగాపిక్సెల్ కెమెరా వంటి ఫీచర్లు ఉన్నాయి. 8జీబీ+256 జీబీ మెమొరీ కలిగిన మాడల్ ధర రూ.29,999గాను, 12జీబీ+256 జీబీ మెమొరీ కలిగిన మాడల్ ధర రూ.31,999, 12జీబీ+512 జీబీ మెమొరీ కలిగిన మాడల్ రూ.33,999గా నిర్ణయించింది. సెల్‌బే సంస్థ ఎండీ సోమ నాగరాజు, షియోమీ ఏపీ-టీఎస్ జోనల్ హెడ్ సయ్యద్ అన్వర్ తదితరులు హాజరయ్యారు.

హోండా సిటీ ప్రియం

న్యూఢిల్లీ, జనవరి 9: కార్ల కొనుగోలుదారులకు హోండా ఇండియా షాకిచ్చింది. రెండు మాడళ్ల ధరలను రూ.58 వేల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. సిటీ సెడాన్ ధర రూ.8 వేల వరకు సవరించింది. దీంతో ఈ మాడల్ ధర రూ.11.71 లక్షల నుంచి రూ.16.19 లక్షల మధ్యలోకి చేరుకున్నది. అలాగే ఎలివేట్ మాడల్ ధరను రూ.58 వేల వరకు సవరించింది.

భారత్ వృద్ధి 6.4%: ప్రపంచ బ్యాంక్

న్యూఢిల్లీ, జనవరి 9: భారత ఆర్థిక వ్యవస్థ వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6.4 శాతం వృద్ధి సాధిస్తుందని, 2025-26లో ఇది 6.5 శాతానికి పుంజుకుంటుందని ప్రపంచ బ్యాంక్ తాజా అంచనాల్లో పేర్కొంది. ప్రస్తుత 2023-24లో 6.3 శాతం వృద్ధిచెందుతుందని అంచనా వేసింది. అయితే గత ఏడాది జూన్‌లో ప్రకటించిన అంచనాలనే యథాతథంగా అట్టిపెట్టింది. బ్యాంక్ గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ రిపోర్ట్ మంగళవారం విడుదల చేసింది. పటిష్టమైన సర్వీసుల రంగం, పెట్టుబడులు మద్దతుగా నిలుస్తున్నందున వేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన హోదాను నిలుపుకుంటుందని రిపోర్ట్‌లో వివరించింది. బ్యాంకింగ్ రంగంతో సహా కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్స్ మెరుగయ్యాయని, అధిక ప్రభుత్వ పెట్టుబడులు ఊతమిస్తున్నాయని తెలిపింది.

మీనాక్షి చౌదరి, రాధాకృష్ణ, శ్రీలీల, మహేష్‌బాబు, త్రివిక్రమ్

సంక్రాంతి మాకు బాగా కలిసొచ్చిన పండగ

'గత 25 ఏండ్లుగా మీరు చూపిస్తున్న అభిమానాన్ని మరచిపోలేను. ప్రతి ఏడాది అది పెరిగిపోతున్నది. సంక్రాంతి నాన్నగారికి, నాకు బాగా కలిసొచ్చిన పండగ. ఈ సీజన్‌లో మా సినిమా రిలీజైతే అది బ్లాక్‌బస్టరే. ఈసారి కూడా బాగా గట్టిగా కొట్టబోతున్నాం' అన్నారు మహేష్‌బాబు. ఆయన కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించారు. ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఏపీలోని గుంటూరులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ మాట్లాడుతూ 'సినిమాకు వందశాతం పని చేయాలంటే రెండొందల శాతం పనిచేసే హీరో ఎవరైనా ఉన్నారంటే అది మహేష్‌బాబు ఒక్కరే అని చెప్పడం అతిశయోక్తి కాదు. అతడు, ఖలేజా టైమ్‌లో మహేష్‌బాబు ఎలా ఉన్నాడో.. ఈ రోజు కూడా అలాగే ఉన్నాడు. పర్‌ఫార్మెన్స్‌లో కూడా అంతే నూతనత్వం కనిపిస్తున్నది. ఈ సంక్రాంతిని రమణగాడితో కలిసి జరుపుకుందాం' అన్నారు. మహేష్‌బాబు మాట్లాడుతూ 'త్రివిక్రమ్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన ఫ్రెండ్‌కంటే ఎక్కువగా ఫ్యామిలీ మెంబర్‌లా ఫీలవుతాను. ఆయనతో ఎప్పుడు సినిమా చేసినా పర్‌ఫార్మెన్స్ విషయంలో ఓ మ్యాజిక్ జరిగిపోతుంది. అతడు, ఖలేజా సినిమాల్లో ఏదో మ్యాజిక్ ఉందనిపిస్తుంది. 'గుంటూరు కారం' విషయంలో కూడా అదే జరిగింది. ఈ సినిమాలో కొత్త మహేష్‌బాబుని చూడబోతున్నారు. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. 'కుర్చీ మడతపెట్టి..' పాటకు థియేటర్లు బద్దలైపోతాయి. నాన్నగారు నా సినిమా చూసి రికార్డులు, కలెక్షన్ల గురించి చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించేది. ఆయన ఫోన్ కాల్ కోసం ఎదురుచూసేవాడిని. ఇప్పుడు ఆ వివరాలన్నీ మీరే నాకు చెప్పాలి. ఇక నుంచి మీరే నాకు అమ్మ, నాన్న' అన్నారు.

'గుంటూరు కారం' టికెట్ రేట్ల పెంపు

'గంటూరు కారం' సినిమా టికెట్ రేట్ల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. సింగిల్ స్క్రీన్స్‌లో 65 రూపాయలు, మల్టీప్లెక్స్‌లలో 100 రూపాయలు పెంచుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ నెల 12 అర్ధరాత్రి ఒంటిగంట నుంచి రాష్ట్రంలోని 23చోట్ల బెనిఫిట్ షోల ప్రదర్శనకు కూడా పర్మిషన్ ఇచ్చింది. వీటితో పాటు ఈ నెల 12 నుంచి 18 వరకు ఉదయం నాలుగు గంటల షోకు కూడా తెలంగాణ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.

ఆమెతో పోల్చితే ఆనందమే!

'నా సామిరంగ' చిత్రం తెలుగులో తనకు మంచి బ్రేక్‌నిస్తుందని చెప్పింది కన్నడ భామ ఆషిక రంగనాథ్. నాగార్జున కథానాయకుడిగా విజయ్ బిన్ని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆషిక రంగనాథ్ మాట్లాడుతూ 'నాగార్జున వంటి అగ్ర హీరోతో తెరను పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాలో నేను పల్లెటూరి అమ్మాయి వరాలు పాత్రలో కనిపిస్తా. తను స్వతంత్ర్య భావాలు కలిగిన అమ్మాయి. సాధారణంగా గ్రామీణ నేపథ్య సినిమాల్లోని కథానాయికలు సున్నిత వ్యక్తిత్వంతో కనిపిస్తారు. కానీ వరాలు అలాంటి అమ్మాయి కాదు. తను ఓ ధిక్కార స్వభావి. సినిమా చూసిన తర్వాత 'అమ్మాయంటే ఇలాగే ఉండాలి' అనుకుంటారు. కథానుగుణంగా నాగార్జునగారికి, నాకు మధ్య మంచి రొమాంటిక్ సీన్స్ ఉంటాయి. కన్నడ, తెలుగు సంప్రదాయాలు ఒకేలా ఉంటాయి. అందుకే ఇక్కడి ఇండస్ట్రీ చాలా సౌకర్యంగా అనిపిస్తున్నది. నాకు సీనియర్ నాయిక అనుష్క అంటే చాలా ఇష్టం. నన్ను కొందరు జూనియర్ అనుష్క అని పిలుస్తుంటారు. అలాంటి గొప్ప నటితో పోల్చడం నాకు ఆనందమే (నవ్వుతూ). గ్లామర్‌తో పాటు అభినయానికి ప్రాధాన్యత ఉన్న పాత్రలను చేయాలనుకుంటున్నా. అలాగే పీరియాడిక్ ఫిల్మ్ చేయాలనుంది. ఏదో ఒకరోజు రాజమౌళిగారి సినిమాలో నటించాలని బలంగా కోరుకుంటున్నా' అని చెప్పింది.

ఆషికా రంగనాథ్

చిత్రం

'సైంధవ్'..ఓ భావోద్వేగ ప్రయాణం

'హిట్' సిరీస్ చిత్రాలతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా గుర్తింపును తెచ్చుకున్నారు శైలేష్ కొలను. ఆయన దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా నటించిన 'సైంధవ్' చిత్రం ఈ నెల 13న విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా శైలేష్ కొలను పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

- 'హిట్-2' తర్వాత ఓ సందర్భంలో వెంకటేష్‌గారిని కలిశాను. ఆ తర్వాత జరిగిన రెండుమూడు మీటింగ్స్‌లోనే మా మధ్య మంచి బాండ్ ఏర్పడింది. అప్పుడే 'సైంధవ్' కథ చెప్పాను. 'కథ చాలా బాగుంది. ఇది నా 75వ సినిమా అనిపిస్తోంది' అంటూ వెంకటేష్‌గారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలా ఈ సినిమా మొదలైంది.
- ఇప్పటివరకు నేను ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ చేశాను. భావోద్వేగాలు కలబోసిన కథను డైరెక్ట్ చేయడం ఇదే తొలిసారి. తమ కూతురుని రక్షించుకునే క్రమంలో 17కోట్ల రూపాయల విలువైన ఇంజక్షన్ కోసం తపన పడే పేరెంట్స్, ఈ క్రమంలో వచ్చే ఎమోషనల్ సన్నివేశాలు సినిమాకు ఆయువుపట్టులా ఉంటాయి.
- ఈ కథ 70శాతం రాత్రివేళలో జరుగుతుంది. దాంతో నైట్ సీక్వెన్స్‌లు ఎక్కువగా ఉంటాయి. ఈ సినిమాలో ప్రతినాయకుడిగా నటించిన నవాజుద్దీన్ సిద్ధిఖీ పాత్ర చాలా యూనిక్‌గా ఉంటుంది. 'ఇంద్రప్రస్థ' అనే ఫిక్షనల్ సిటీలో ఈ కథ నడిచినట్లు చూపించాం. డ్రగ్స్, గన్ బిజినెస్ కార్యకలాపాల నేపథ్యంలో ఇంద్రప్రస్థ నగరం మరో ప్రపంచాన్ని తలపిస్తుంది.
- వెంకటేష్‌గారి 75వ చిత్రమిది. అయితే ఈ విషయంలో నేను ఎలాంటి ఒత్తిడిగా ఫీల్ కాలేదు. నిజాయితీగా సినిమాలు తీయడమే నా పని. జయాపజయాల కంటే ప్రయాణాన్ని ఆస్వాదించే తత్వం నాది. 'సైంధవ్' కథను ఎంతగానో ప్రేమించి కమిట్‌మెంట్‌తో తీశాను. తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం 'హిట్-3' స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది. అయితే ఆ సినిమా రావడానికి మాత్రం మరో ఏడాదిన్నర పడుతుందని అనుకుంటున్నా.

తప్పుడు వార్తలపై చర్యలు తీసుకుంటాం

సంక్రాంతి సినిమాల విషయంలో కొన్ని వెబ్‌సైట్స్, మీడియా సంస్థలు తప్పుడు వార్తలు రాసి పరిశ్రమలో ఇబ్బందికరమైన వాతావరణాన్ని సృష్టించాయని..భవిష్యత్తులో అలాంటి వార్తా కథనాలపై చర్యలు తీసుకుంటామని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి హెచ్చరించాయి. ఈ మేరకు మంగళవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. 'ఏదైనా వార్తను రాసేముందు సంబంధిత దర్శకనిర్మాతలకు సంప్రదించి వాస్తవాలు తెలుసుకోవాల్సిందిగా కోరుతున్నాం. వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసేలా వార్తలు రాయడం మంచిపద్ధతి కాదు. ఇక నుంచి సోషల్‌మీడియాలో, ఇతర వేదికలపై నిరాధారమైన వార్తలు రాస్తే చర్యలు తీసుకుంటాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రాంతి, శ్రీలు

కొత్త రంగుల ప్రపంచం

క్రాంతి, శ్రీలు జంటగా నటిస్తున్న చిత్రం 'కొత్త రంగుల ప్రపంచం'. సీనియర్ నటుడు పృథ్వీరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 20న విడుదలకానుంది. సోమవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దర్శకుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ 'ఇన్నాళ్లు నన్ను ఆర్టిస్టుగా ఆదరించారు. ఈ సినిమాతో దర్శకుడిగా మీ ముందుకు వస్తున్నా. పేరుకు తగ్గట్టుగానే అందమైన ప్రేమకథా చిత్రమిది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది. వినోదానికి పెద్దపీట వేశాం' అన్నారు. హృద్యమైన భావాలు కలబోసిన లవ్‌స్టోరీ ఇదని హీరో క్రాంతి చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: శివారెడ్డి, నిర్మాతలు: పద్మరేఖ, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, దర్శకత్వం: పృథ్వీరాజ్.

శ్రీకాకుళం కన్యాకుమారి

శ్రీచరణ్, గీత్ సైని జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కన్యాకుమారి'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో దామోదర నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమా టీజర్‌ను అగ్ర హీరో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. ఈ సినిమాలో శ్రీకాకుళం అమ్మాయి కన్యాకుమారి పాత్రలో కథానాయిక గీత్‌సైని కనిపించనుంది. డిగ్రీ చదివిన కన్యాకుమారి ఓ చీరల దుకాణంలో పనిచేస్తుంటుంది. అందంతో పాటు పొగరూ ఎక్కువే. అలాంటి అమ్మాయి ప్రేమలో పడితే ఏం జరిగిందన్నదే సినిమా కథాంశమదని, వినోదప్రధాన ప్రేమకథగా మెప్పిస్తుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శివ గాజుల, హరిచరణ్ కె, సంగీతం: రవి నిడమర్తి, నిర్మాణ సంస్థ: రాడికల్ పిక్చర్స్, రచన-నిర్మాణం-దర్శకత్వం: దామోదర.

పాట.. కథ చెప్పాలి!

కృష్ణకాంత్

సరళమైన భాషలో అర్థవంతమైన సాహిత్యంతో గీత రచన చేస్తూ తెలుగులో ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు పాటల రచయిత కృష్ణకాంత్. సమకాలీన తెలుగు చిత్రసీమలో మెలోడీ గీతాలకు ఆయన్ని కేరాఫ్ అడ్రస్‌గా చెబుతారు. నేడు కృష్ణకాంత్ జన్మదినం. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. ''నేను కెరీర్‌లో ఎక్కువగా మెలోడీ గీతాలే రాశాను. అవే నాకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. గత ఏడాది సలార్, విరూపాక్ష, హాయ్ నాన్న, కోట బొమ్మాళి, జైలర్, జవాన్, లియో, చిన్నా వంటి చిత్రాలకు రాసిన పాటలు మంచి సంతృప్తినిచ్చాయి. దాదాపు 70 పాటల వరకు రాశాను. త్వరలో విడుదల కాబోతున్న హను-మాన్, సైంధవ్, ఈగల్ చిత్రాలకు పాటలు రాశాను. ప్రభాస్-మారుతి కాంబినేషన్ చిత్రానికి కూడా పాటలు రాస్తున్నా. సినిమా కథను ఆవిష్కరించడంలో పాట కూడా ఓ సాధనంలా పనిచేస్తుంది. నా దృష్టిలో మంచి పాట..సినిమా కథేమిటో చెబుతుంది. అసభ్య, ద్వంద్వార్థాలతో కూడిన పాటలను నేను అస్సలు రాయను. కమర్షియల్ గీతాలు ఆ టైమ్ వరకే పాపులర్ అవుతాయి. కానీ అర్థవంతమైన మెలోడీ గీతాలు కలకాలం నిలిచిపోతాయి. పాటలతో పాటు ఇప్పటికే కొన్ని చిత్రాలకు మాటలు కూడా రాశాను. భవిష్యత్తులో పాటల, మాటల రచయితగా ప్రయాణం కొనసాగిద్దామనుకుంటున్నా' అని చెప్పారు.